*"వేరి గుడ్. రియల్లి ఐ యామ్ ప్రౌడ్ ఆఫ్ యూ. నీలాంటి సబార్డినేట్స్ ఉన్నందుకు నాకెంతో సంతోషంగా వుంది" అన్నాడు. ఆఫీసర్ ఆనంద్ గుర్నాధం తెచ్చిన ఫైలు మీద సంతకం పెడుతూ.*



# ప్రమోషన్

– ఓ.పాడూరి

"ఇంకో విషయం దీనికి సంబంధించిన రికార్డులన్నీ జాగ్రత్తగా ఉంచు మళ్లీ అవసరపడతాయి" అని ఆర్డరిచ్చాడు. "ఓ.కే.సార్" అని చెప్పి సెక్షన్‌కు తిరిగొచ్చాడు గుర్నాధం రెండో ప్రపంచ యుద్ధంలో పోరాడిన సైనికుడిలా.

★ ★ ★ ★

గుర్నాధం రిజర్వు బ్యాంకులో చేరి అర్థ దశాబ్దం కావస్తుంది. మొదట గుమస్తాగా చేరిన గుర్నాధం పైవారి, క్రిందివారి తోటి ఉద్యోగులతో "సిన్సియర్"అనే ఓరల్ సర్టిఫికెట్ సంపాదించాడు. ఆఫీసుకె తాళి కట్టినట్లుగా భార్య ఎంత అరచి గీపెట్టినా ఒక్క రోజు కూడా లీవ్ పెట్టకుండ రెగ్యులర్‌గా హాజరవుతున్నాడు. ఇప్పుడతనికి ప్రమోషన్ డ్యూ. అందుకె ఆఫీసర్ "ఇంపార్టెంట్" అని అప్పజెప్పిన కేసుకు సంబంధించిన రికార్డులని పదిరోజులు మైక్ టైసన్‌లా ఫైట్ చేసి చివరకు దొరక బట్టాడు. ఆఫీసర్ దృష్టిలో కూడా సిన్సియర్‌గా నమోదయ్యాడు. కూర్చీలో కూర్చొని స్వప్న లోకాల్లో విహరించ సాగాడు గుర్నాధం. ప్రమోషన్ వస్తే జీతం కనీసం మూడు వందలైనా పెరుగుతుంది. దానితో కుటుంబ ఆర్థిక పరిస్థితి కొంత మెరుగు పడుతుంది. భార్య వేధింపులకు బ్రేక్ పడుతుంది. ఉద్యోగంలో ఇంకొక పై మెట్టు అంటే ఆకాశమంత...... ఆలోచిస్తున్న గుర్నాధం "ఏమండి గుర్నాధం ఈ రిపోర్టు కాస్త పంపించండి" అన్న సెక్షన్ ఆఫీసర్ పిలుపుకి ఈ లోకంలోకి వచ్చి ఆ రిపోర్టును సంబంధిత సెక్షన్‌కు పంపించి ఆ రోజు పని ముగించుకొని బయలు పడ్డాడు గుర్నాధం.

ఆలిండియా రేడియో స్టేషన్ ముందు అరగంట సేపు వెయిట్ చేసినా బస్సు దొరక్క పోయేసరికి, లేటుగా వెళితే భద్రకాళిలా విరుచుకు పడే భార్యను తలచుకుంటూ రాని బస్సుకోసం నిరీక్షించసాగాడు గుర్నాధం. తర్వాత పదిహేను నిముషాలకు నూట యాభై ఎనిమిదో నంబరు బస్సు నెలలు నిండిన గర్భిణిలా స్టేజి దాటి పోతు పోలీస్ కంట్రోల్ రూం ప్రక్కన ఆగింది. పి.టి. ఉషలా పరుగు లంఘించుకొని అంత రద్దీలోను ఎక్కాడు గుర్నాధం. ఆ బస్సు ఆరు కిలో మీటర్ల దూరాన్నిఅరవై నిముషాల్లో దిల్‌సుక్‌నగర్ చేరే సరికి "హమ్మయ్యా" అనుకుంటూ ఎయిర్ ఇండియా విమానం నుండి దిగినంతగా ఫీలయ్యి ఇల్లు చేరుకున్నాడు. అప్పటికె ఇంట్లో మిని కురుక్షేత్ర యుద్ధం ప్రారంభం అయ్యిందేమో అర్థాంగి ఆంభోతు అరుపులకు, అమ్మాయి ఏడ్పులకు రెండు గదుల ఆ రెండు గొప్ప సిక్స్‌ట్రాక్ స్టీరియోఫోన్స్ అమర్చిన సినిమా థియెటర్లలో మాదిరిగా ఘోరు మ్రోగుతుంది. జడుసుకుంటూనే అడుగుపెట్టి "కామాక్షి ఏమయ్యింది" అని అడిగాడు. "ఓహో శ్రీవారా. ఏంటి తమరి ముఖం ఈ రోజు కళ కళలాడుతుంది డెటాల్ సబ్బుతో కడిగినట్లుగా" చురక అంటించింది కామాక్షి.

ముందు కోపం వచ్చినా తమాయించుకొని "అసలు సంగతి చెప్పు" అడిగాడు ధైర్యంతో

"తమరి సుపుత్రి సుమిత్రకు ఫైవ్ స్టార్ చాక్లెట్ కావలట ఇప్పించండి" అన్నది మూతి మూడు వంకర త్రిప్పుతూ.

కూతుర్ని అక్కున చేర్చుకొని "పాప ఇంకో నెలరోజులు ఓపిక పట్టు పెద్దాచాక్లెట్టే తెచ్చి కొనిస్తాను సరేనా" అని లాలించాడు.

ఆమాటలకు "నెల రోజుల తర్వాత లాటరీ తగుల్తుందా ఏంటి" అడిగింది కామాక్షి.

"అది కాదె నాకు ప్రమోషన్ వస్తుంది. ఈ రోజు ఆఫీసర్‌కు కూడ నా మీద ఇంప్రెషన్ ఏర్పడింది. ఇక ప్రమోషన్ కేవలం నెల రోజుల లోపే" ఉషారుగా చెప్పాడు.

"ఏంటి ప్రమోషనా, మీకు మోషన్ రావల్సిందే. గత ఆర్నెల్లుగా అరిగిపోయిన రికార్డులా అదె మాటంటున్నారు. ఇక ఆ సుత్తి ఆపి ముఖ కడుక్కొని రండి కాఫీ తగిలేస్తా"

"కాఫీ! వద్దు నీ కాఫీ కన్న ఆ కుళాయి నీళ్ల బెస్ట్" అంటూ బాత్ రూం కెళ్లాడు. ఇలాంటి సంఘటనలు వారిరువురి మధ్య రోజు ఉదయించె సూర్యునిలా ప్రతివారం తప్పనిసరి. అయినా భూదేవంత ఓర్పుతో వచ్చి ప్రమోషన్ కొరకు వేయి కళ్లతో ఎదురు చూస్తు ఆ రాత్రి గడిపాడు గుర్నాధం.

★ ★ ★ ★

ముందు ఊహించినట్లుగానే ఓ రోజున పనిలో లీనమై ఉన్న గుర్నాధానికి "కంగ్రాచ్యులేషన్స్ గుర్నాధం యు గాట్ ప్రమోషన్" అని చెప్పాడు సెక్షనాఫీసర్. అంతే ప్రక్కనున్న కొలీగ్స్ అంతా ఒకెసారి అభినందనలు తెలిపారు.

"ఏమోయ్ గుర్నాధం పార్టీ ఎప్పుడిస్తున్నావ్" అడిగాడు సీనియర్ అసిస్టెంట్ శివానందం.

"ఇస్తాను లేండి. ప్రస్తుతం నా దగ్గర డబ్బులేవు" దీనంగా ఉన్న వాస్తవాన్ని తెలియ జేశాడు గుర్నాధం.

"భలె వాడివే నేనున్నది దేనికోయ్. ముందు నువ్వు రడి అను డబ్బుల సంగతి నేచూసుకుంటా. పార్టీ ఈ రోజిస్తేనే మజా" అతిని మాటలకు మిగతా వారంత వత్తాసు పలికారు.

ఇక తప్పదని హోటల్ అశోకాలో అందరికి పార్టీ ఇచ్చాడు. బిల్లు మూడువందలు.

లంచ్ తర్వాత బిల్స్ సెక్షన్ కెళ్లి అడిగాడు గుర్నాధం "సార్ నాకు ఎంత పెరిగిందో కాస్త చెబుతారా"

అతని ఆత్రుతను గమనించి "అయిదు నిముషాలు లెక్కలు వేసి లేల్చి చెప్పాడు' "డెబ్బై రూపాయలు గుర్నాధం" అని.

అంతే పక్షవాతం వచ్చినట్లుగా కాళ్ళ వణకడం ప్రారంభించాయి. మూడు వందల పెరుగుతుందని అంచనా వేసి, మూడు వందలు వదిలించుకొని కొలీగ్స్‌కు పార్టీ ఇచ్చాను. తీరా పెరిగింది డెబ్బై రూపాయాలా "అంటూ నా తల వ్రాత అనుకుంటూ సెక్షన్‌కు వచ్చాడు. అతని మనస్సులో సిన్సియర్‌గా పని చేసినందుకు ప్రతి ఫలంగా గవర్నమెంట్ ఇచ్చేది ఇదా" అని కసి ఏర్పడింది. కాని తప్పదు. ఉదర పోషణార్థం ఉద్యోగం చెయ్యక తప్పదు. సాయంత్రం అయిదు వరకు ఎలాగో గడిపి ఇల్లు చేరుకున్నాడు. ఇదివరటిలా కాక ఆ రోజు భర్త రాగానే టీ ఇస్తు చెప్పింది కామాక్షి "ఏవంటి ఇంటి ఓనరు ఈ నెల నుండి అద్దె యాభై రూపాయలు పెంచమన్నారండి".

ఆ మాటలకు అదె నెల మొదటి తేది నుండి పెరిగిన బస్సు చార్జీల వల్ల అధనంగా అయ్యె యాభై రూపాయల విషయం సడన్‌గా గుర్తుకు రాగానే భూకంపం వచ్చినట్లుగా కుర్చీలో కూలబడిపోయాడు గుర్నాధం. ●